# పగిలే దశలో ఉన్న 'మహాధమని'కి క్లిష్టమైన శస్త్రచికిత్స

### మలక్‌పేట్ యశోదాలో మహిళకు పునర్జన్మ

**జనగాం,మార్చి 28 (పీసిడబ్ల్యూ న్యూస్):** ప్రాణాంతకమైన రక్తనాళ వ్యాధితో మృత్యువు అంచుల్లోకి వెళ్లిన ఓ 52 ఏళ్ల మహిళను మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సతో కాపాడారు. 'సైలెంట్ కిల్లర్'గా పిలిచే అబ్డామినల్ ఆఒర్టిక్ అన్యూరిజం (AAA)తో బాధపడుతున్న ఆమెకు సకాలంలో చికిత్స అందించి ప్రాణాపాయం నుండి బయటపడేశారు. శరీరంలోని ప్రధాన అవయవాలకు రక్తాన్ని సరఫరా చేసే అతిపెద్ద ధమని 'ఆఒర్టా' (మహాధమని). ఇది బలహీనపడి, బుడగలా ఉబ్బిపోవడాన్నే అన్యూరిజం అంటారు. ఇది అకస్మాత్తుగా పగిలితే తీవ్ర అంతర్గత రక్తస్రావం జరిగి, రోగి నిమిషాల్లోనే మరణించే ప్రమాదం ఉంది. **కేసు వివరాలు.. ప్రాణాలను కాపాడిన సమయస్ఫూర్తి** జనగాం ప్రాంతానికి చెందిన 52 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పి, వెన్నునొప్పితో ఆసుపత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జన్ డా. రంజిత్




కుమార్ ఆనందను, ఆమెకు 'సక్యులర్ ఇన్‌ఫ్రారెనల్ అబ్డామినల్ ఆఒర్టిక్ అన్యూరిజం' ఉన్నట్లు గుర్తించారు. ఇది ఏ క్షణమైనా పగిలిపోయే ప్రమాదం ఉండటంతో తక్షణమే శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించారు. అత్యాధునిక శస్త్రచికిత్స – మల్టీడిసిప్లినరీ విధానం ద్వారా డా. రంజిత్ కుమార్ నేతృత్వంలోని బృందం అత్యంత సంక్లిష్టమైన 'ఆఒర్టో–ఇలియాక్ బైపాస్' శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఆపరేషన్ తర్వాత కిడ్నీ సమస్యలు (AKI), రక్తహీనత, కాలేయ సంబంధిత ఇబ్బందులు ఎదురైనప్పటికీ.. క్రిటికల్ కేర్, నెఫ్రాలజీ, కార్డియాలజీ నిపుణుల సమన్వయంతో వాటిని అధిగమించారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. వైద్యులు మాట్లాడుతూ.."కడుపు నొప్పి వెన్ను వైపు వ్యాపించడం ఈ వ్యాధికి ప్రధాన సంకేతం. ఇలాంటి కేసుల్లో సెకన్ల కాలం కూడా విలువైనదే. సకాలంలో రోగిని గుర్తించ డం, అత్యాధునిక వాస్క్యులర్ సర్జరీ సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్లే ఆమెను కాపాడగలి గామని డాక్టర్ రంజిత్ కుమార్ ఆనందను తెలిపారు. క్లిష్టమైన కేసును విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర అభినందించారు. అత్యంత క్లిష్టమైన గుండె, రక్తనాళాల సమస్యలకు యశోదా ఆసుపత్రులు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు.

# సీనియర్ న్యాయవాది సహోదర్ రెడ్డికి ఘన సన్మానం



**హనుమకొండ, మార్చి 28 (పీసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన దామెర మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు ముద్దసాని సహోదర్ రెడ్డిని హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు బోకే, శాలువా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు సహోదర్ రెడ్డి న్యాయవాదుల సంక్షేమానికి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి, తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు బార్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికవడం ఆయనకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో న్యాయవాదులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమానికి బలం చేకూర్చిన వ్యక్తిగా సహోదర్ రెడ్డి గుర్తింపు పొందారని చెప్పారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, మండల అధ్యక్షుడు ఎండి బాబుమియా (చిరు), ఇర్సడ్ల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల వారీగా డ్రైనేజీ పనులపై పర్యవేక్షణ: చైర్మన్ సునీల్ కుమార్





**పరకాల, మార్చి28 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో కొనసాగుతున్న డ్రైనేజీ పనుల్లో నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చొరవతో TUFIDC నిధులతో చేపట్టిన ఈ పనులను ఆయన శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పట్టణంలోని 12, 15, 21, 22వ వార్డుల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, పిట్టవాడ, నటరాజ్ టాకీస్ రోడ్, జయ డీలక్స్ రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సునీల్ కుమార్ సమీక్షించారు. పనుల్లో ఆలస్యం లేకుండా, నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కొయ్యాడ శ్రీనివాస్, కౌన్సిలర్లు సుధమల్ల రమేష్, అల్లె దశరథం, బండి శ్రీధర్, కుక్కల విజయ్ పాల్గొన్నారు. అలాగే పొరండ్ల వేణు, గొడుగు నాగరాజు, ఆకుల శ్రీధర్, మున్సిపల్ ఏఈ రోహిత్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఖురేషి, సూపర్వైజర్ శివతో పాటు స్థానికులు హాజరయ్యారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో పారిశుధ్య సమస్యలు తగ్గుతాయని, ప్రజలకు శుభ్రమైన వాతావరణం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# గీతా కార్మికుల గుండెల్లో గాయం.. ఆదుకునే చేయి ఎక్కడ?

### పింఛన్ లేదు.. బీమా లేదు.. ప్రమాదాల మధ్య ప్రాణాలతో పోరాటం



**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో గీతా కార్మికుల జీవితం అక్షరాలా ప్రమాదాలతో నిండి ఉంది. చెట్లపైకి ఎక్కి తాటి కల్లెం తీయడం వారి వృత్తి అయినప్పటికీ, ప్రతి రోజు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నామని వారు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 90 మంది గీతా కార్మికులు జీవనోపాధి కోసం ఈ కష్టసాధ్యమైన వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ, ప్రభుత్వ పరంగా అందాల్సిన కనీస భరోసా కూడా వారికి అందడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. గ్రామానికి చెందిన బండి సర్వేశం, పోషాల సారయ్య, బిక్షపతి, సమ్మయ్య తదితరులు మీడియాతో మాట్లా డుతూ తమ గోడును వెల్లగక్కారు. "చెట్టు ఎక్కడం అంటే ప్రాణాలతో ఆట. ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితిలో పనిచేస్తున్నాం. అయినా మాకు పింఛన్ సౌకర్యం లేదు. గౌడలకు సంబంధించిన బీమా పథకాలు కూడా అమలు కావడం లేదు. ప్రమా దాలు జరిగితే కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తోంది" అని వేదన వ్యక్తం చేశారు.

చెట్టు మీద నుంచి పడిపోవడం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, అలాంటి సందర్భాల్లో వైద్య ఖర్చులు భరించడం భారంగా మారుతోందని కార్మికులు చెబుతున్నారు. "గాయపడితే ఆదుకునే వారు ఎవరూ లేరు. ప్రభుత్వ పథకాలు కేవలం పత్రిక లకే పరిమితం అవుతున్నాయి. అర్హులైన మాకు మాత్రం అందడం లేదు" అని వారు ఆరోపించారు. ప్రత్యేకంగా గీతా కార్మికులకు అమలు చేయాల్సిన బీమా పథకాలు సక్రమంగా అమలు చేయాలని, ప్రమాద బారిన పడిన వారికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని వారు కోరుతున్నారు. పింఛన్ సౌకర్యం కల్పించడం ద్వారా తమ కుటుంబాలకు కొంత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గీతా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. జీవన పోరాటంలో నలిగిపోతున్న ఈ కార్మికుల గోడును ప్రభుత్వం వినిపి ంచుకుంటుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# ప్రతి నెల 30న పౌర హక్కుల దినోత్సవం జరపాలి



**చిట్యాల మార్చి 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నే యుగేంధర్ ఆధ్వర్యంలో ప్రతినెల 30న పౌర హక్కుల ( సివిల్ రైట్స్ డే) దినోత్సవాన్ని జరపాలని అంబేద్కర్ ఫెలోషి ప్ నేషనల్ అవార్డు గ్రహీత రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య తహసిల్దార్ గారికి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతినెల 30న గ్రామాలలో పౌర హక్కుల దినోత్సవం సంబంధించిన అధికారులు జరుపాలని ఈ పౌర హక్కుల దినోత్సవం లో గ్రామ సర్పంచి వార్డ్ మెంబర్లు వివిధ కులాల ప్రజలు ఇందులో పాల్గొనే విధంగా చూడాలని ముఖ్యంగా సహ పంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని అన్నారు ఎస్సీలు ఎదుర్కొంటున్న అంటరానితనం కుల వ్యవస్థ మూఢనమ్మకాలు అస్పృశ్యత అను అంశాలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్కర్లుంచాలని అన్నారు. మారుమూల గ్రామాలలో ఇంకా కుల వ్యవస్థ అంటరానితనం కొనసాగుతుందని చెప్పారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు. కార్యదర్శి దాసారపు నరేష్. అంబేద్కర్ వాదులు గురుకుంట్ల కిరణ్. నేరేళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.


# ములుగు జిల్లా గిరిజన గ్రామాలకు చేరని 'సంజీవిని' వాహనాలు

### ప్రారంభోత్సవానికి నోచుకోక పడకేసిన 50 బైక్ అంబులెన్స్‌లు



**ములుగు, మార్చి 28 (ప్రత్యేక ప్రతినిధి పి.సి.డబ్ల్యూ, ఏటూరునాగారం):** రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే గుర్తుకు వచ్చేది 108 అంబులెన్స్ సేవలు. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందిస్తూ ఆసుపత్రులకు తరలించి ప్రాణాలను కాపాడడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాల కారణంగా 108 వాహనాలు సకాలంలో చేరుకోలేని పరిస్థితులు తరచుగా ఎదురవుతున్నాయి. ఫలితంగా క్షతగాత్రులు ఆసుపత్రికి చేరక ముందే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం 'సంజీవిని' పథకం కింద బైక్ అంబులెన్స్ సేవలను నాలుగేళ్ల క్రితం ప్రారంభించింది. అటవీ ప్రాంతాలు, రోడ్డు సదుపాయం లేని గిరిజన గ్రామాలకు వేగంగా చేరుకునేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడ తాయని భావించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఉపయోగపడేలా ములుగు ఏజెన్సీలోని ఏటూరునాగారం ఐటీడీఏకు మొత్తం 50 బైక్ అంబులెన్స్‌లు మంజూరు చేశారు. అయితే ఈ వాహనాలు జనవరి నెలలోనే ఏటూరునాగారం చేరుకున్నప్పటికీ ఇప్పటివరకు ప్రజలకు అందుబా టులోకి రాలేదు. ప్రస్తుతం ఈ బైక్ అంబులెన్స్‌లు ఐటీడీఏ కార్యాలయ ఆవరణలోనే ఎండలో నిలిపివేసి ఉన్నాయనే విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని ఏయే ప్రాంతాలకు కేటాయించారో, ఎప్పుడు పంపిస్తారో స్పష్టత లేకపోవడంతో వాహనాలు నిరుప యోగంగా మారాయి. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా "పీహెచ్‌సీలకు పంపిస్తాం" అంటూ స్పష్టత లేని సమాధానాలతో తప్పించుకుంటున్నారని సమాచారం. ఒక్కో బైక్ అంబులెన్స్ విలువ సుమారు రూ. 2.5 లక్షలు ఉండగా, ఇంత విలువైన వాహనాలు వినియోగానికి నోచుకోక ఎండలో పడేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. జనవరి చివరి వారంలో జరిగిన మేడారం మహా జాతర సందర్భంగా కొంతమేర ఈ వాహనాలను వినియోగించినప్పటికీ, అనంతరం వాటిని పూర్తిస్థాయిలో వినియోగించక పోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో అనేక గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో అంబులెన్స్‌లు చేరుకోవడం కష్టసా ధ్యంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో బైక్ అంబు లెన్స్ సేవలు ప్రారంభిస్తే అత్యవసర వైద్య సేవలు వేగంగా అందే అవకాశం ఉంది. **గిరిజనుల డిమాండ్:** సంజీవిని బైక్ అంబులెన్స్‌లను వెంటనే సంబంధిత గ్రామాలకు పంపించి సేవలు ప్రారంభించాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి



**గంగాధర మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఉమ్మడి జిల్లా నీటి సంఘాల ఫోరం మాజీ అధ్యక్షులు బి రెడ్డి కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదని ఇప్పటికైనా స్థానిక సంస్థలతోపాటు నీటి సంఘాల ఎన్నికల నిర్వహించాలని ఉమ్మడి జిల్లాలో 525 నీటి సంఘాలు ఉన్నాయని అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో 1997లో నీటి సంఘాలను ఏర్పాటు చేసి 100 ఎకరాల ఆయకట్ట ఉన్న నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిందని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారులకు వచ్చిన తర్వాత 2008లో దానికి కాలపరిమితి మూడు సంవత్సరాలకు పెంచిందని దాని తర్వాత రెండు సంవత్సరాలు 2013 డిసెంబర్ 31 వరకు పొడిగించిందని దాని తర్వాత స్పెషల్ ఆఫీసర్లను నియమించారు నియమించడం వల్ల సాగునీటి నిర్వహణపై పట్టింపు లేకుండా పోయిందని ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

